**SAKSHI** 11 SEP 2020

# విధులకు ఆలస్యమైతే కఠినచర్యలు

యానాం: ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధులుకు ఆలస్యంగా వస్తే కఠినమైన చర్యలు తీసుకుంటానని పుదుచ్చేరి సీఎం నారాయణసామి హెచ్చరించారు. గురువారం ఆయన పుదుచ్చేరిలోని న్యూహెడ్‌క్వార్టర్స్‌లోని సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఉద్యోగులతో మాట్లాడారు. పుదుచ్చేరి వ్యాప్తంగా త్వరితగతిన కరోనా వ్యాపిస్తుందని ఈ నేపథ్యంలో దానిని నిర్మూలించడానికి ప్రభుత్వం అనేక విధాలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు వందశాతం విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయంలో 24 వివిధ శాఖలకు చెందిన కార్యదర్శిలు ఉండాల్సి ఉండగా కేవలం 19 శాఖలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నాయని మిగిలిన ఐదు శాఖలు పనే చేయడం లేదని అన్నారు. 10శాతం జనరల్ సెక్రటరియేట్ ఉద్యోగులు విధులుకు రావడం లేదని అన్నారు. భవిష్యత్తులో 100శాతం మంది ఉద్యోగులు రాకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. కరోనాతో ఇప్పటికే ఐదు నెలల నుంచి ప్రజాపనులు స్తంభించాయని అన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులంతా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# కేశవ వర్మకు 'గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్' అవార్డు

యానాం: చిత్రకళలో తన కుంచెతో విభిన్నమైన కళాఖండాలను వేసే యానాంకు చెందిన కాకర్లపూడి కేశవవర్మకు క్రియేటివ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఆర్ట్ కాంపిటేషన్‌లో గ్రేట్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడుతూ 'ఐ సాల్యూట్ ఇండియన్ ఆర్మీ అండ్ ప్రౌడ్ టు బి ఇండియన్' అనే అంశంపై దేశవ్యాప్తంగా క్రియేటివ్ ఆర్ట్స్ పోటీ నిర్వహించిందన్నారు. దేశ సైనికులు జాతీయజెండాను పర్వతంపై నిలుపుతున్నట్టు వేసిన చిత్రానికి అవార్డు, ప్రశంసాపత్రం లభించాయన్నారు. విజయవాడ ఆర్ట్ సొసైటీకి చెందిన వడ్డాది పాపయ్య నేషనల్ ఆన్‌లైన్ పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు సైతం తాను చిత్రాన్ని వేసి పంపించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు తాను వేసిన చిత్రాలకు 52 అవార్డులు వచ్చినట్టు తెలిపారు.



అవార్డుకు ఎంపికైన కేశవవర్మ వేసిన ఇండియన్ ఆర్మీ చిత్రం

## పుదుచ్చేరిలో 71.7 శాతం రికవరీ

మంత్రి మల్లాడి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా కరోనా నుంచి 71.7శాతం మంది చికిత్స పొంది ఆరోగ్యవంతంగా రికవరీ అవుతున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లలో మొత్తం 18,084 మంది కరోనా ప్రభావానికి గురయ్యారని 12,967(71.70) శాతం వివిధ ఐసోలేషన్‌వార్డుల్లో చికిత్సపొంది ఆరోగ్యవంతంగా ఇంటికి వెళ్లారని తెలిపారు. రోజుకు 3వేల కరోనా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఇప్పటివరకు 88,060 మందికి నిర్వహించినట్లు తెలిపారు. ఆవిధంగా 67,745 పరీక్షలు నెగిటివ్‌గా వచ్చాయన్నారు.

## 38 పాజిటివ్ కేసులు

యానాం: నియోజకవర్గ పరిధిలో గురువారం కొత్తగా 38 పాజిటివ్ కేసులు నిర్ధారణ అవడంతో మొత్తం పాజిటివ్ కేసులు సంఖ్య 1188కు చేరుకుంది. అదేవిధంగా 183 మంది జీజీహెచ్‌లోని ఐసోలేషన్ వార్డుల్లోను, 109 మంది హోమ్‌ఐసోలేషన్‌లోను చికిత్సపొందుతుండగా 862 మంది చికిత్స పొంది ఆరోగ్యవంతంగా ఇంటికి వెవెళ్లినట్లు ఆర్ఏఓ శివరాజ్‌మీనా తెలిపారు.

**ANDHRA JYOTHI** 11 SEP 2020

## సబ్ సెంటర్లలో కొవిడ్ పరీక్షలు: మంత్రి మల్లాడి

యానాం, సెప్టెంబర్ 10: పుదుచ్చేరిలోని కరోనా కేసులు అత్యధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. పుదుచ్చేరిలోని తన కార్యాలయంలో ఆరోగ్యశాఖ బులిటెన్‌ను ఆయన విడుదల చేశారు. గ్రామల్లో ఉన్న సబ్ సెంటర్లలో ప్రతి రోజు వంద పరీక్షలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. రోజుకు యానాంలో 300, కారైకాల్‌లో 600, మాహెలో 200 పరీక్షలు నిర్వహించడానికి చర్యలు చేపట్టామన్నారు. మాస్కు ధరించి, భౌతిక దూరం పాటిస్తే కరోనాను నియంత్రించవచ్చన్నారు.

### యానాంలో 292 యాక్టివ్ కేసులు

యానాంలో ఇప్పటివరకు 5,390 పరీక్షలు చేయగా 1,188 పాజటివ్ కేసులు నమోదుయ్యాయని పరిపాలనాధికారి శివరజ్‌మీనా తెలిపారు. 34మంది మృతిచెందగా 862మంది డిశ్చార్జి అయ్యారన్నారు. యాక్టివ్ కేసులు 292 ఉన్నాయన్నారు. యానాం ప్రభుత్వాసుపత్రి, మెట్టకుర్రు, బీసీ బాలుర వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తులు త్వరగా కోలుకోవడానికి క్యారమ్స్, చెస్ ఆడుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. యానాం ఆసుపత్రిలో ఇంకా అదనంగా వెంటిలేటర్లు తదితర సౌకర్యలు కల్పిస్తామన్నారు.

**ENADU** 11 SEP 2020

## మృతుల్లో అత్యధికులు చక్కెర వ్యాధిగ్రస్తులు

**యానాం:** కరోనాతో పుదుచ్చేరి వ్యాప్తంగా మృతి చెందుతున్న వారిలో అత్యధికులు చక్కెర వ్యాధిగ్రస్తులేనని ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఎస్.మోహన్‌కుమార్ తెలిపారు. చనిపోయిన వారి నివేదికలు పరిశీలిస్తే ఎక్కువమంది చక్కెరవ్యాధిగ్రస్తులు, రక్తపోటు ఉన్నవారేనన్నారు. పైరెండు రోగాలు ఉన్నవారు కరోనా లక్షణాలుంటే ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు.

### కట్టడికి ఆరంచెల ప్రణాళిక

కేంద్రం నియమించిన ప్రత్యేక నిపుణుల బృందం సూచనలకనుగుణంగా పుదుచ్చేరి ప్రభుత్వం కరోనా కట్టడికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని, దీనిని పకడ్బందీగా అమలుచేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు కలెక్టర్ డాక్టర్ టి.అరుణ్ తెలిపారు. టెస్టులు ఎక్కువగా నిర్వహించడం, ప్రత్యేక కంటైన్‌మెంట్ చర్యలు, కరోనాతో ఉన్నవారి కాంటాక్టుల గుర్తింపు, ఆక్సిజన్ పడకల సంఖ్యను పెంచుతామన్నారు. ఇళ్లలో ఉండి కరోనా చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబసభ్యులు నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేలు జరిమానా విధించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందన్నారు.